

ఏక కాలంలో రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌దే 8
8 అభివృద్ధి పనుల బిల్లులు ఇప్పించండి

జోరందుకున్న వరినాట్లు



తంగళ్లపల్లిలో...

కోనరావుపేటలో వరినాట్లు వేస్తున్న మహిళలు

- జిల్లాలో రెండు రోజులుగా వాన
- చెరువుల్లోకి చేరుతున్న వరద నీరు
- మిడ్ మానేరులోకి ఇన్‌ఫ్లో
- 15,222 ఎకరాల్లో నాట్లు
- వానాకాలం సాగుపై ఆశలు సజీవం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు అన్న దాతల ఆశలకు ఊపిరి పోశాయి. సీజన్ ప్రారంభమై రెండు నెలలు దగ్గర పడుతున్నా సమృద్ధిగా వర్షాలు కురవక రైతులు ఆందోళనకు గురయ్యారు. నారు మడులు ముదిరిపోతున్న క్రమంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వర్షాలు కురుస్తున్నాయి. వానాకాలం సీజన్ అదును దాటిపోతుందని అందోళన చెందుతున్న రైతులకు శనివారం కూడా వర్షం కురవడం ఊరటనిచ్చింది. సిరిసిల్లలో 8.5 మిల్లీ మీటర్లు, వేములవాడలో 11.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వానాకాలం సీజన్ లో ఈ వర్షాలు పంటలకు జీవం పోసినట్లుగా రైతులు భావిస్తున్నారు. జిల్లాలో 2.42 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగుకు సిద్ధమైన రైతులు 1.83 లక్షల ఎకరాల్లో వరి వేయడానికి నారుమడులు సిద్ధం చేసుకున్నారు. వర్షాలు లేకపోవడంతో ఫిబ్రవరి మొదటి వారం వరకు జిల్లాలో కేవలం 4310 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేసుకున్నారు. ఒకవైపు కూలీల కొరత, మరోవైపు వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు వర్షాలు ఊరటనివ్వడంతోపాటు బీహార్, ఒరిస్సా, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి కుటుంబాలతో సహా వ్యవసాయ కూలీలు వలస రావడంతో వరినాట్లు పెరిగాయి. పది రోజుల్లోనే దాదాపు పది వేల ఎకరాల ,వరకు నాట్లు పడ్డాయి. జిల్లాలో ప్రస్తుతం 15,222 ఎకరాల్లో నాట్లు వేసుకున్నారు. గంభీరావుపేటలో 969 ఎకరాలు, ఇల్లంతకుంట 4755, ముస్తాబాద్ 1838, సిరిసిల్ల 183, తంగళ్లపల్లి 1222, వీర్నపల్లి 680, ఎల్లారెడ్డిపేట 3338, బోయినపల్లి 307, చందుర్తి 626, కోనరావుపేట 674, రుద్రంగి 10, వేములవాడ 5, వేములవాడ రూరల్ 610 ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి. జిల్లాలో 2.45 ఎకరాల్లో వానాకాలం సీజన్ పంటల్లో 61902 ఎకరాల్లో వేసుకున్నారు. ఇందులో మొక్కజొన్న 869 ఎకరాలు, కందులు 682, పెసర 40, సోయాబీన్ 10, జొన్న 78 ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు.

జిల్లాలో వానాకాలం సాగు (ఎకరాల్లో)

మండలం	సాగు అంచనా	ప్రస్తుతం
గంభీరావుపేట	19535	1174.56
ఇల్లంతకుంట	39987	17245.32
ముస్తాబాద్	24239	2327.32
సిరిసిల్ల	5417	985.0
తంగళ్లపల్లి	22270	1972.65
వీర్నపల్లి	8095	889.25
ఎల్లారెడ్డిపేట	23093	6816.6
బోయినపల్లి	21150	6628.32
చందుర్తి	22016	6341.0
కోనరావుపేట	24295	5114.1
రుద్రంగి	10857	3856.0
వేములవాడ	7820	5106.0
వేములవాడ రూరల్	14340	3446.6
మొత్తం	2,42,766	1,902.72

జూలై 20 వరకు జిల్లాలో వర్షపాతం (మి.మీ)

మండలం	సాధారణం	కురిసింది
రుద్రంగి	301.3	280.3
చందుర్తి	295.7	510.6
వేములవాడ రూరల్	290.0	301.6
బోయినపల్లి	253.5	280.5
వేములవాడ	289.3	376.8
సిరిసిల్ల	277.6	333.3
కోనరావుపేట	253..5	222.2
వీర్నపల్లి	264.2	249.5
ఎల్లారెడ్డిపేట	254.8	232.6
గంభీరావుపేట	253.2	177.9
ముస్తాబాద్	225.3	267.3
తంగళ్లపలి	282.4	362.0
ఇల్లంతకుంట	213.1	278.1
సగటు వర్షపాతం	265.7	297.9

పత్తి రైతుల్లో ఆనందం

జిల్లాలో పత్తి రైతుల్లో వర్షాలు ఆనందాన్ని నింపాయి. జిల్లాలో 49215 ఎకరాల్లో పత్తి సాగు లక్ష్యంగా పెట్టుకోగా జూలై మొదటి వారం వరకే దాదాపు విత్తనాలు వేసుకున్నారు. 44649 ఎకరాల్లో పత్తి విత్తనాలు వేసుకున్న రైతులు మొలకెత్తి ఎదిగే దశలో వర్షాలు లేక నష్టపోతామని అందోళనలో ఉన్న క్రమంలో అల్పపీడన వర్షాలు పత్తికి జీవం పోసినట్లుగా మారింది. గంభీరావుపేటలో 180 ఎకరాలు, ఇల్లంతకుంటలో 11911 ఎకరాలు, ముస్తాబాద్‌లో 348 ఎకరాలు, సిరిసిల్లలో 783 ఎకరాలు, తంగళ్లపల్లిలో 644 ఎకరాలు, వీర్నపల్లిలో 208 ఎకరాలు, ఎల్లారెడ్డిపేటలో 3376 ఎకరాలు, బోయినపల్లిలో 6055 ఎకరాలు, చందుర్తిలో 5680 ఎకరాలు, కోనరావుపేటలో 4370 ఎకరాలు, రుద్రంగిలో 3320 ఎకరాలు, వేములవాడలో 5004 ఎకరాలు, వేములవాడ రూరల్ 2790 ఎకరాల్లో పత్తి విత్తనాలు వేసుకున్నారు. పత్తి కొద్దిమేరకు కురిసిన వర్షాల వల్ల మొలకెత్తగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల పత్తి దిగుబడిపై అశలు కల్పించింది.

చెరువులకు జలకళ

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చెరువులు కుంటల్లోకి వరదనీరు చేరుతోంది. మానేరు, మూలవాగు నుంచి మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 236 క్యూసెక్కుల నీరు చేరుతోంది. 27.54 టీఎంసీల సామర్థ్యం ఉన్న మిడ్ మానేరు ప్రాజెక్టులో ప్రస్తుతం 5.57 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. జిల్లాలోని మూలవాగు, ఎగువ మానేరు, ప్రాజెక్టులోకి నీరు చేరుతోంది. వర్షానికి జిల్లా కేంద్రంలోని కార్మిక వాడల్లో రోడ్లపై నీరు ప్రవహిస్తోంది. గ్రామాల్లో పాతకాలపు ఇళ్లు ప్రమాదకరంగా మారాయి. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్అండ్‌బీ, వైద్య శాఖల అధికారులు సమన్వయంతో తెగిపోయిన రోడ్లు, చెరువులు, కుంటల అలుగుల వద్ద తగు జాగ్రత్తలు తీసుకున్నారు. పోలీస్ అధికారులు సిబ్బందిని ఏర్పాటు చేశారు.

పోలీసుల అప్రమత్తత

తుఫాను ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలను పోలీసులు అప్రమత్తం చేశారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రచారం చేస్తున్నారు. భారీ వర్షాలతో పొంగి పొర్లే చెరువులు, కాలువలు, జలపాతాలకు వద్దకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని సూచనలు చేశారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాన్ని కూడా అందుబాటులో ఉంచారు. విపత్కర సమయంలో డయల్ 100కు ఫోన్ చేయాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు.

విద్యార్థులకు

పాఠం చెప్పిన కలెక్టర్

- సిరిసిల్లలో జడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ
- గైర్హాజరైన ఉపాధ్యాయిని సస్పెన్షన్



తరగతి గదిలో బోధిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా విద్యార్థులకు ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్, భౌతిక శాస్త్రాలను బోధించారు. జిల్లా కేంద్రంలోని గీతానగర్ జడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి విద్యాబోధన తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఇచ్చిన సమాధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన తయారీ విధానాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. స్టోర్‌లోని వస్తువులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో బాలుర టాయిలెట్లను స్వయంగా పరిశీలించి చిన్న చిన్న మరమ్మతులు ఉంటే పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు హాజరు పట్టికలు సాధారణ సెలవు రిజిస్టర్‌లను పరిశీలించారు. సెలవు దరఖాస్తు ఇవ్వకుండా గైర్హాజరైన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. ప్రధానోపాధ్యాయిని శారద, ఉపాధ్యాయులు ఉన్నారు.

●అధికారిక అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరైన స్కూల్ అసిస్టెంట్ రాధారాణిని డీఈవో సస్పెండ్ చేశారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శనివారం పాఠశాలను తనిఖీ చేసిన సందర్భంలో అనుమతి లేకుండా గైర్హాజరవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో నిర్ణయం తీసుకున్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న ఎంపీడీవో సత్తయ్య

ఎల్లారెడ్డిపేట, జూలై 20: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. వన మహోత్సంలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అధికారులతో కలిసి శనివారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్తయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో రోడ్డుకిరువైపుల మొక్కలు నాటాలన్నారు. పల్లెలు పచ్చదనంతో కళకళలాడేలా చూడాలన్నారు. ఎంపీవో వజీర్‌అహ్మద్, ఈజీఎస్ ఏపీవో కొమురయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో చదరంగం పోటీలు

ఎల్లారెడ్డిపేట, జూలై 20: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్ నారాయణపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో అంతర్జాతీయ చదరంగం పోటీలను శనివారం నిర్వహించారు. విద్యార్థులు పోటాపోటీగా ప్రతిభను కనబర్చారు. చదరంగంతో ఆలోచన శక్తి మెరుగుపడుతుందన్నారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

గుంతల పూడ్చివేత

ఎల్లారెడ్డిపేట, జూలై 20: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని రాపల్లివాగు వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు పనులను చేపట్టకపోవడంతో వర్షానికి గుంతలు ఏర్పడి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సత్తయ్య ఆధ్వర్యంలోని అధికారులు శనివారం మరమ్మతు పనులను చేపట్టారు. మట్టిని పోయించి గుంతలను పూడ్చివేశారు. ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఎంపీవో వజీర్‌అహ్మద్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, కాంట్రాక్టర్ శంకర్ తదితరులు ఉన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 20 : ప్రజలకు సేవలు అందించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా కోరారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పట్టణాలతోపాటు అన్ని మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజా పాలన సేవా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అర్జీలు సమర్పించేందుకు నిత్యం కలెక్టరేట్‌కు వచ్చే వారికి సైతం ప్రజాపాలన సేవా కేంద్రం అందుబాటులో ఉండాలని భావించి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరుగ్యారంటీల్లోని వంట గ్యాస్ సిలిండర్‌రాయితీ, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ తదితర పథకాలను అర్హులైన ప్రతీ కుటుంబానికి అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పలు కారణాలతో ఉచిత విద్యుత్, గ్యాస్‌సిలిండర్ సబ్సిడీ పొందలేక పోతున్న అర్హులు ప్రజాపాలన సేవా కేంద్రాలను సందర్శించాలని, లోటుపాట్లు ఉంటే సరిచేయించుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లోని సేవా కేంద్రం ప్రభుత్వ కార్యాలయాల పని దినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, విద్యుత్ సర్వీస్‌కనెక్షన్ నంబరు, గ్యాస్ కనెక్షన్ నంబరు, ఎల్‌పీజీ కస్టమర్ ఐడీ, సెల్ ఫోన్ నంబర్లను వెంట తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఆర్‌వో వంగరి శ్రీధర్, ఈ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కస్తూర్బా పాఠశాలను పరిశీలించిన ప్రభుత్వ విప్



ప్రత్యేక అధికారితో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

గంభీరావుపేట, జూలై 20 : గంభీరావుపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. మున్నూరు కాపు ఆత్మీయ సత్కార సభకు గంభీరావుపేటకు వచ్చిన ఆది శ్రీనివాస్ తిరిగి వెళ్తుండగా కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. భోజనం, వసతుల విషయమై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. సరిపడా టాయిలెట్స్ లేక ఇబ్బంది పడుతున్నామని ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అంచనాలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులతో ఫోన్‌లో చెప్పారు. మరి కొన్ని సమస్యలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల హమీద్ నేతృత్వంలో నాయకులు పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమంలో సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, నాయకులు ఉన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోనాలు



బోనాలతో విద్యార్థులు

బోయిన్‌పల్లి , జూలై 20: బోయినపల్లి మండలంలోని విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పోచమ్మ బోనాల పండగ నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య బయల్దేరి ఆలయంలో పోచమ్మకు బోనాలను సమర్పించారు. విద్యార్థులు పోతరాజు, పులి వేషధారణ, నృత్యాలతో ఆకట్టుకున్నారు. పండుగలపై విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు కార్యక్రమం చేపట్టినట్లు ప్రధానోపాధ్యాయుడు బొలగం శ్రీనివాస్ తెలిపారు.

ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి, జూలై 20: రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మెట్ట సాయికుమార్‌ను తంగళ్లపల్లికి చెందిన జిల్లా ఫిషరీస్ ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్ సన్మానించారు. శనివారం హైదరబాద్‌లో బాధ్యతలు తీసుకున్న సందర్భంగా సాయికుమార్‌ను కలిశారు. కాంగ్రెస్ నాయకులు లింగాల భూపతి, సుద్దాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రుణమాఫీకి ప్రజల నుంచి అపూర్వ స్పందన

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, జూలై 20: రైతుల రుణమాఫీకి ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం కిష్టంపేటలో శనివారం రైతు రుణమాఫీపై రైతులతో ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఏకకాలంలో రుణమాఫీ అయ్యిందని, మళ్లీ ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి హయాంలో ఏకకాలంలో రుణమాఫీ జరిగిందని అన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఒక మోడల్ కాబోతోందన్నారు. ఏకకాలంలో రైతు రుణమాఫీపై రైతులు హర్ష వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా, మన్మోహన్‌సింగ్ ప్రధానిగా, యూపీఏ చైర్ పర్సన్‌గా సోనియాగాంధీ ఉన్నప్పుడు వన్ టైమ్ సెటిల్మెంట్ అయినట్లు గుర్తు చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి హయాంలో వన్ టైం సెటిల్ మెంట్ అయ్యిందన్నారు. రైతులకు రుణమాఫీ కింద రాష్ట్రంలో సుమారు 7 వేల కోట్లలో లక్ష లోపు రుణం తీసుకున్న రైతులకు 11.50 లక్షల పైచిలుకు, జిల్లా పరిధిలో 23 వేల మంది, వేములవాడ నియోజకవర్గ పరిధిలో 11 వేల పైచిలుకు మంది రైతులకు రుణ మాఫీ అయ్యినట్లు తెలిపారు. వరంగల్ లో రైతు డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి తుక్కుగూడ మహాసభలో సోనియా గాంధీ ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ హామీ మేరకు అమలు చేస్తున్నట్లు చెప్పారు. లక్ష రూపాయలు లోపు రుణమాఫీ చేశామన్నారు. ఈ నెలాఖరులోగా రూ. లక్ష నుంచి 1,50,000 లోపు, ఆగస్టులో రూ.1,50,000 నుంచి రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేయనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఊరేగింపుగా రైతు వేదికల వద్దకు వెళ్లడం చూస్తుంటే దసరా రోజు జంబి గద్దెకు పోవడం గుర్తుకొస్తోందన్నారు. ముఖ్యమంత్రి చెప్పినట్లుగా రైతై ఉండి రైతుకు భూమి ఉండి పాస్ పుస్తకంపై రుణమాఫీ పొందడమే అర్హతగా పరిగణిస్తామన్నారు. మాఫీ కాని, పేర్లు తప్పిపోయిన రైతులకు గ్రీవెన్స్ సెల్ ద్వారా అర్జీలు స్వీకరించి మాఫీ చేస్తామన్నారు. గతంలో రైతుబంధు పేరిట గుట్టలు, చెట్లు, వాగులు, వంకలు, అనర్హులకు రైతుబంధు ఇచ్చారన్నారు. రైతు భరోసా కూడా అందజేస్తామన్నారు. రేషన్ కార్డు నిబంధన కేవలం కుటుంబ గుర్తింపు కోసం మాత్రమేనన్నారు. అంతకుముందు ఒక రైతు రూ.80 వేలు. మరో రైతు రూ.75 వేల రుణమాఫీ అయ్యిందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు చింత పంటి రామస్వామి, భీమరాజు కనకరాజు, మ్యాకల గణేష్, ముస్కు ముకుందరెడ్డి, బొజ్జ మల్లేశం, బాణాల రవీందర్ రెడ్డి, దేవరాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చందుర్తి మండలంలోని మూడపల్లి, జోగాపూర్, కిష్టంపేట గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం పరామర్శించారు.

సీఎంను కలిసిన ఫుడ్‌కమిషన్ సభ్యుడు



సీఎం రేవంత్‌రెడ్డితో ఆనంద్

ఇల్లంతకుంట, జూలై 20: సీఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్ర ఆహార భద్రతా కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ శనివారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆహారభద్రతా చట్టం అమలు అవుతున్న తీరును సీఎం అడిగి తెలుసుకున్నట్లు ఆనంద్ తెలిపారు.

పంచాయతీ భవనానికి దారేది?



దారికి అడ్డుగా మొక్కలు

ఎల్లారెడ్డిపేట, జూలై 20: ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ భవనానికి దారి లేకుండాపోయింది. గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన మూడేళ్ల కిందట రూ.20 లక్షలతో భవనాన్ని నిర్మించారు. సుమారు 10 అడుగుల వరకు సీసీ రోడ్డును వేశారు. డ్రైనేజీ ఉండడంతో అక్కడ పనులు చేపట్టలేదు. దీంతో ముందు ఉన్న స్థలం నుంచి కార్యాలయానికి అధికారులు ప్రజలు వెళ్లాల్సి వచ్చింది. ఇటీవల సదరు స్థల యజమాని చుట్టూ కంచెను ఏర్పాటు చేశాడు. దీంతో పంచాయతీ భవనంలోని కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వెళ్లేందుకు అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ భవనానికి దారేది? అని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని, కార్యాలయానికి వెళ్లేందుకు దారిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని పరిష్కరించాలి

- బీజేపీ నాయకుల డిమాండ్
- ఒక్కరోజు దీక్షకు పలువురు నాయకుల మద్దతు

సిరిసిల్ల రూరల్, జూలై 20: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడంతో పాటు అసాములు, కార్మికులకు ఉపాధి కల్పించి విద్యుత్ సబ్సిడీని కొనసాగించాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రెడ్డబోయిన గోపి, కరీంనగర్ పార్లమెంటరీ కో కన్వీనర్ అడెపు రవీందర్‌లు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని సెస్ కార్యాలయం ఎదుట శనివారం భారతీయ జనతా పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఒక రోజు దీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న బీజేపీ నాయకులకు చేనేత వస్త్ర వ్యాపార సంఘం పాలిస్టర్ వస్త్ర ఉత్ప త్తిదారుల సంఘం, కాటన్ ఉత్పత్తి దారుల సంఘం, అసాముల సమన్వయ కమిటీ సంఘం, డైయింగ్ అసాముల సంఘం నాయకులు దీక్ష శిబిరాన్ని సంద ర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమ మనుగడ కోసం ఉచిత విద్యుత్ కావాలని, అలాగే మరమగ్గాల కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇ వ్వాల్సిన పది శాతం యారన్ సబ్సిడీతో పాటు కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వర్కర్‌టు ఓనర్ పథకాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మరమగ్గాల పరిశ్రమకు సంబంధించిన కరెంట్ పాత బకాయిలను మాఫీ చేయడంతో పాటు బతుకమ్మ చీరలకు సంబంధించిన పెండింగ్ బకాయిలను ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కొత్త అర్డర్లను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడంతో పాటు నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించాలని కోరారు. సిరిసిల్లలో ఎనిమిది నెలలుగా ఉపాధి లేక ఆత్మహత్యలకు పాల్పడ్డ కార్మిక కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అదుకోవడంతో పాటు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండ నరేష్, మోర రవి, గాజుల సదానందం, కోడం అనంద్ బాబు, దుమాల శ్రీకాంత్, గాజుల వేణు, మేర్గు శ్రీనివాస్, కోడం రవి, సుంచు ప్రకాష్, కోడం శ్రీనివాస్, తవుటు రాజలింగం, వడ్నాల శ్రీకాంత్, వేముల రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న బీజేపీ నాయకులు

జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

జమ్మికుంట రూరల్, జూలై 20: రవాణా రంగ కార్మికుల సమస్యలపై మంగళవారం కరీంనగర్‌లో నిర్వహిస్తున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పబ్లిక్, ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి అన్నారు. జమ్మికుంటలో శనివారం 200మంది ట్రాలీ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా పున్నం రవి వారికి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోటారు రవాణ రంగ కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు కార్మికులకు అందేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. డ్రైవర్లకు ఉరితాడుగా మారిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డిజిల్, ఇన్సూరెన్స్, ఫిటెనెస్ ధరలు తగ్గించాలన్నారు. ఐదు లక్షల ప్రమాద బీమా ఏ షరతు లేకుండా వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే డిమాండ్లు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే ఆందోళనలు చేస్తామని తెలిపారు. కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌లో గల ముకుందా లాల్ మిశ్రా సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చెలికాని శ్రీనివాస్, మౌటం రఘు, ప్రధాన కార్యదర్శి పూలవేన కుమార్, పర్లపల్లి పవన్, సతీష్, తదితరలు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో 70 మంది ఉద్యోగుల బదిలీ

- త్వరలో సబ్ రిజిస్ట్రార్లకు స్థానచలనం?

కరీంనగర్ క్రైం, జూలై 20: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో 70 మంది ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఈ మేరకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించిన అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని 14 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల్లో 46 మంది జూనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు షరాఫ్‌లు, 21 మంది అటెండర్లను బదిలీ చేశారు. త్వరలోనే ఉమ్మడి జిల్లాలోని 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని పలువురు సబ్‌రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లకు కూడా బదిలీలు జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. దీర్ఘకాలంగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను బదిలీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ముగ్గురు మాత్రమే రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్‌లు ఉండగా మిగతా 11 చోట్ల సీనియర్ అసిస్టెంట్లు ఇన్‌చార్జి సబ్ రిజి స్ట్రార్లుగా పనిచేస్తున్నారు. ఈ 11 చోట్ల రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లను నియమించే అవకాశముంది. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లున్న చోట్ల భారీఎత్తున అవినీతి జరుగుతున్నట్లు ఆరోప ణలు వస్తున్నాయి. ఇప్పటికైనా రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లను నియ మించి కార్యాలయాల్లో అవినీతి జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బావిలో పడ్డ నక్కలు

- సురక్షితంగా బయటకు తీసిన ఫారెస్ట్ అధికారులు



అధికారులు బయటకు తీసిన నక్క

కథలాపూర్, జూలై 20: మండలంలోని బొమ్మెనలో శనివారం ఓ రైతు బావిలో రెండు నక్కలు పడ్డాయి. రైతు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో కొడిమ్యాల డిప్యూటీ రేంజ్ అధికారి ముషీర్ అహ్మద్ నేతృత్వంలో నక్కలను సురక్షితంగా బయటకు తీశారు. బీట్ అధికారి మధుసూదన్, వాచర్లు గంగాధర్, ఎర్రయ్య, నల్లగొండం స్థానిక రైతులతో కలిసి వలల సహాయంతో బయటకు తీసి ఫారెస్ట్‌లోకి వదిలి పెట్టారు. దీంతో సమీప అడవుల్లోకి పరుగులు పెట్టాయి.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య

జ్యోతినగర్, జూలై 20: ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న పన్నాల శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక అన్నపూర్ణ కాలనీకి చెందిన శ్రీనివాస్ గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. పురుగుల మందు తాగి అస్వస్థతకు గురైన శ్రీనివాస్‌ను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మరణించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు.

రెండు కార్లు ఢీ: నలుగురికి గాయాలు



కల్వర్టులోకి దూసుకు పోయిన కారు

సుల్తానాబాద్, జూలై 20: పట్టణంలోని రాజీవ్ రహదారిపై శనివారం రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఓ కారు రాజీవ్ రహదారి పక్కనున్న కల్వర్టులో పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ నుంచి ఓ కుటుంబం వైద్య చికిత్స నిమిత్తం కరీం నగర్‌కు వెళ్లింది. తిరిగి శనివారం మహదేవ్‌పూర్‌కు వెళుతున్నారు. ఈ క్రమంలో వారి కారు సుల్తానాబాద్ పట్టణంలోని ఓ పెట్రోల్ బంక్ సమీపం నుంచి వెళ్తుండగా పెద్దపల్లి నుంచి కరీంనగర్ మార్గంలో వెళుతున్న మరో కారు యూటర్న్ తీసుకుంటూ వేగంగా ఢీకొట్టింది. దీంతో కారు రోడ్డు పక్కన గల కల్వర్టులో పడి పోయింది. ప్రమాదంలో కారులోని ఇద్దరు మహిళలు, ఇద్దరు పురు షులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: యువకుడి మృతి



రాజేందర్(ఫైల్)

దండేపల్లి, జూలై 20: దండేపల్లి మండ లం కన్నెపల్లిలో సదానందయ్య స్వామి ఆలయ సమీపంలో ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో యువ కుడు మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామా నికి చెందిన వోల్లాల రాజేందర్ (39) మండలంలోని గూడెం షిర్డీ సాయి బాబా ఆలయంలో కుటుంబ సమేతంగా పని చేస్తున్నాడు. పనుల నిమిత్తం శుక్రవారం రాత్రి అతడితో పని చేసే పుల్లూరి నరేష్‌తో కలిసి బైక్‌పై లక్షెట్టిపేట వెళ్లారు. తిరిగి గూడెం ఆలయం వైపునకు వస్తుండగా గూడెం నుంచి లక్షెట్టిపేట కరీంనగర్ చౌరస్తా వైపునకు వేగంగా వచ్చిన బైక్ ఎదురుగా వస్తున్న రాజేందర్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేందర్ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాల య్యాయి. లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాజేందర్ మృతి చెందాడు. రాజేందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజేందర్ భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నా మని ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

పాతకక్షలతో గొడ్డలితో దాడి

- ఒకరికి తీవ్ర గాయాలు

మానకొండూర్, జూలై 20: మండలంలోని దేవంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి పాతకక్షలను ధ్రుష్టిలో పెటుకొని ఓ వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన యువకుడు, అతడి తండ్రి గొడ్డలతో దాడికి పాల్పడ్డ సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యా యి. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవంపల్లి గ్రామానికి చెందిన గాడిచర్ల తిరుపతి అనే వ్యక్తి, అదే గ్రామానికి చెందిన గాడిచర్ల రాజు అనే వ్యక్తుల ఇళ్లు ప్రక్కపక్కనే ఉన్నాయి. ఇంటి వద్ద గల మూడు గజాల భూమి విషయంలో గతంలో గొడవలతో పంచాయతీ జరిగింది. కాగా శుక్రవారం రాత్రి గ్రామంలో వంశీ, గాడిచర్ల సాయికుమార్ అనే వ్యక్తులు ఒక్క దగ్గర ఉన్నాడు. ఆ సమయంలో గాడిచర్ల తిరుపతి వ్యక్తి గత పనిపై వెళుతూ రాత్రి అయింది ఇంటికి వెళ్లు అంటూ వంశీని మందలించినట్లు తెలిపారు. దీంతో సాయికుమార్ పాతకక్షలను ధ్రుష్టిలో పెట్టుకొని ఇంటికి వెళ్లి తండ్రి రాజుతో కలిసి గొడ్డలి పట్టుకొని అకస్మాత్తుగా తిరుపతి భుజం, వీపుపై మూడు చోట్ల దాడికి పాల్పడ్డారు. అనంతరం పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ తిరుపతిని కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తిరుపతి సోదరుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏసీడీపీ పనులపై ఆడిట్ కొరడా

▸ నిబంధనలకు విరుద్ధంగా విడుదలైన నిధుల రికవరీకి ఆదేశాలు ▸ ఎన్నికల ముందు అడ్డగోలుగా కేటాయింపులు

▸ నిబంధనలు గాలికి..గుడ్డిగా ప్రొసీడింగ్‌లు



రికవరీకి ఆదేశించిన ఎల్‌ఐసీ ఏజెంట్ల భవనం

కోల్‌సిటీ, జూలై 20: నియోజకవర్గాల అభివృద్ధి పనుల్లో నిబంధనల ఉల్లంఘనలపై రాష్ట్ర ఆడిట్ విభాగం కొరడా ఝుళిపించింది. ఎన్నికలకు ముందు నిబంధనలను గాలికివదిలి ఇష్టారాజ్యంగా నిధులు కేటాయించడం, ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు ఎలాంటి హామీ పత్రాలు లేకుండా నిధులు ఇవ్వడాన్ని ఆడిట్ తప్పుపట్టింది. రామగుండం నియోజకవర్గ పరిధిలోని కార్పొరేషన్ ఏరియాలో జరిగిన రెండు పనులకు చెల్లించిన బిల్లుల రికవరీకి అకౌంటెంట్ జనరల్(ఆడిట్) ఆదేశాలు జారీ చేసింది. ఆడిట్ అభ్యంతరాలతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం ప్రస్తుతం జరుగుతున్న పనులు, టెండర్ల దశలో ఉన్న పనులపై దృష్టి పెట్టింది. నిబంధనలు అమలు చేస్తేనే పనుల కేటాయింపులు ఉంటాయంటూ స్పష్టం చేస్తుంది. ఇప్పటికే నిధులే లేని నియోజకవర్గ అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఒక్కో పనికి ఐదారుసార్లు టెండర్లు పెట్టినా స్పందన కరువైంది.

● ఎన్నికల సమయంలో..

కొవిడ్‌తో రెండేళ్ల నియోజకవర్గ అభివృద్ధి పనులు (సీడీపీ) ఆపిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో మూడు కోట్ల రూపాయలు కేటాయించింది. రామగుండం నియోజకవర్గ పరిధిలోని కార్పొరే షన్‌లోనే 116పనులకు కేటాయింపులు జరిగాయి. వీటిలో కుల సంఘాలు, కళా సంఘాలు, దేవాలయాల్లో మండపాలు, యు వజన సంఘాలు, గణపతి మండపాలు, వ్యాపారవర్గాల అసోసియేషన్లు, మహిళా సంఘాల భవనాల వరకు కేటాయింపులు చేశారు. ఇందులో కొన్ని పనులను మ హిళా సంఘాల పేర నామినేషన్లపై కేటాయించారు. పలు పనులకు టెండర్లు పెట్టారు. వీటిలో కొన్ని పనులు ప్రారం భం కాగా కొన్నింటికి టెండర్లు పూర్తయ్యాయి. మరో 30 పనులకు టెండర్ల దశలోనే ఆగిపోయాయి.

● కేటాయిపునకు సంబంధించి..

సీడీపీ నిధుల కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. ఈ నిధులను ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలకు కేటాయించాల్సి ఉంటుంది. ఒక వేళ ప్రైవేట్ సంస్థలకు కేటాయింపులు జరిగితే సదరు ఆస్థి, స్థలాలు ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. రామగుండం నియోజకవర్గంలో నిధులు కేటాయించిన ప్రాంతాల్లో మెజార్టీగా భూముల సమస్య ఉంది.

● రెండు పనుల నిధులు..

రామగుండం అర్బన్‌లో సీడీపీ నిధులతో జరిగిన రెండు పనుల నిధుల రికవరీకి ఏజీ ఆడిట్ ఆదేశాలిచ్చింది. గోదావరి ఖని సప్తగిరికాలనీలో నిర్మాణం పూర్తయిన ఎల్‌ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ భవనం, గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ భవనాల్లో జరిగిన చెల్లింపులను రికవరీ చేయాలంటూ చీఫ్ ప్లానింగ్ అధికారి రామగుండం కమిషనర్‌కు లేఖ పంపారు. ఇప్పటికే చెల్లింపులు జరిగిపోవడంతో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఈ రికవరీలు జరిగితే పనుల సిఫార్సు చేసిన అధికారులు కూడా బాధ్యులయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగం ఇందులో ముందస్తుగా నిబంధనల ప్రకారం వ్యవహరించలేదనే ఆరోపణలు న్నాయి. ఏజీ ఆడిట్ ఆదేశాలతో అప్రమత్తమైన సీపీఓ కార్యా లయం బిల్లుల చెల్లిం పులకు వెళుతున్న ఫైళ్లను తిప్పి పంపుతుంది. నిర్మాణాలు జరిగిన స్థలాలు ప్రభుత్వంది అయితేనే చెల్లింపులు చేస్తామని ఖరాఖండిగా పేర్కొంటోంది. ప్రభుత్వ, సింగరేణి స్థలాల్లో జరిగిన నిర్మాణాలకు ఓకే చెబుతున్న సీపీవో కార్యాలయం ప్రైవేట్ స్థలాల్లో జరిగిన నిర్మాణాల విషయంలో అభ్యంతరాలు చెబుతోంది. దీంతో పనులు మొదలు పెట్టని కాంట్రాక్టర్లు వెనుకడుగు వేస్తున్నారు.

కొన్ని అసోసియేషన్లు, వ్యాపార సంఘాలు, కుల సంఘాలకు పట్టా భూములు ఉన్నాయి. వాటిని చందాల సొమ్ము పోగేసి కొనుగోలు చేశారు. ఈ నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి అప్పగించేందుకు సిద్ధంగా లేరు. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ అనవరాలకు వినియోగించు కునేలా పూర్తి స్థాయి హక్కులు ఇవ్వాల్సి ఉంటుంది. ముందస్తు చర్యలు తీసుకోకుండానే జిల్లా యంత్రాంగం ప్రొసీడింగ్‌లు జారీ చేసింది.

● ఆరు సార్లు టెండర్లు పెట్టినా..

ఏసీడీపీ నిధులను సాధారణంగా ప్రజా అవసరాలు తీర్చే పనులకు కేటాయింపులు చేస్తారు. మౌలిక వసతులు, తాగునీరు, పాఠశాలలు వంటి పనులకు కేటాయింపులు చేస్తారు. 20శాతం నుంచి 30శాతం మేర కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు కేటాయిస్తారు. ఎన్నికలకు ముందు జిల్లాలో దాదాపుగా మెజార్టీ కుల సంఘాలకు కేటాయింపులు చేశారు. రామగుండం నియోజకవర్గంలో ఒక్కో కుల సంఘానికి ఏరియాల వారీగా భవనాలకు నిధుల కేటాయింపులు చేశారు. ఇప్పుడు ఆడిట్ అభ్యంతరాలు వ్యక్తం కావడం, నిధులు విడుదల కాకపోవడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సుమారు 30 పనులకు ఐదారు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయడం లేదు.

● జిల్లా అంతటా ప్రభావం..

సీడీపీ పనులకు సంబంధించి నిబంధనలు కఠినతరం కావడంతో జిల్లాలో ఎన్నికలకు ముందు కేటాయించిన పనులపై ప్రభావం పడనున్నది. అప్పటి ప్రజాప్రతినిధుల ఒత్తిడితో ఎన్నికల వేళ జిల్లా అధికారులు కూడా ప్రొసీడింగ్‌లు జారీ చేశారు. ఇప్పుడు పనులు చేయించేందుకు అధికారులు వెనుకడుగు వేసున్నారు. సీపీవో కార్యాలయంలో నిబంధనల విషయంలో కచ్చితంగా వ్యవహరిస్తున్నారు.

హుజూరాబాద్ ఆస్పత్రిలో వైద్యుల కొరత

- ఇటీవల ఏడుగురు బదిలీ.. వారి స్థానంలో వచ్చింది ముగ్గురే.. - ఇబ్బంది పడుతున్న ప్రజలు



హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి

హుజూరాబాద్, జూలై 20: హుజూరాబాద్ ప్రాంతానికి పెద్దదిక్కుగా ఉన్న ఏరియా ఆస్పత్రిలో రెండ్రోజుల క్రితం సాధారణ బదిలీల్లో ఏడుగురు వైద్యులు వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ముగ్గురిని మాత్రమే నియమించారు. దీంతో వైద్య సేవలు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. హుజూరాబాద్ డివిజన్‌లో ఏడు మండలాలకు ఒకటే ఏరియా ఆస్పత్రి ఉండడంతో అందులో డాక్టర్ల కొరత ఏర్పడింది. ఈ ఆస్పత్రిలో ప్రసవాలు, శస్త్ర చికిత్సలు విరివిగా జరిగేవి. గైనకాలజిస్టు డాక్టర్ వాణిలత, సివిల్ సర్జన్ శ్రీకాంత్‌రెడ్డి, పల్లవి, శ్రీనివాస్, మహిపాల్‌ను కరీంనగర్‌కు, డాక్టర్ ప్రత్యూషను పరకాల, డాక్టర్ అర్చనను వర్ధన్నపేటకు బదిలీ చేశారు. వీరి స్థానంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి గైనకాలజిస్టు వైద్యులుగా డాక్టర్ నిశ్చలరెడ్డి, పిల్లల వైద్యులుగా సుభాంగిని, జనరల్ మెడిసిన్ వైద్యుడి రాజేష్ వచ్చారు. సోమశేఖర్ అనే వైద్యుడు కూడా బదిలీ కానున్నట్లు తెలిసింది. హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఏకైక సర్జన్‌గా ఉన్న శ్రీకాంత్‌రెడ్డిని కరీంనగర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సర్జన్ రాలేదు. ఇప్పటికైనా రాష్ట్ర వైద్యాధికారులు, కలెక్టర్ పమేలా సత్పతి స్పందించి హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

జగిత్యాలరూరల్, జూలై20: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన తాళ్ల బుచ్చిమల్లు శనివారం ఉదయం వృత్తిరీత్యా తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు తాటిచెట్టు పై నుంచి కిందపడి తీవ్ర గాయాలపాయ్యాడు. కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ఇద్దరిపై కేసు నమోదు

జమ్మికుంట, జూలై 20: ఓ కాంట్రాక్టు పనిలో వ్యాపార భాగస్వామిగా చేర్చుకుంటామని రూ.82లక్షలు తీసుకొని మోసగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు. ఇచ్చిన డబ్బులు అడిగితే మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, ఎర్రంరాజు సురేందర్‌రాజు అనే వ్యక్తులు తనని చంపుతామని బెదిరింపులకు గురి చేస్తున్నారని, ఆబాది జమ్మికుంటకు చెందిన బాసని పాపిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావును వివరణ కోరగా తాను ఎవరి దగ్గర డబ్బులు తీసుకోలేదని చెప్పారు. తనకు చెడ్డ పేరు తీసుకు రావడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురిపై కేసు

పాలకుర్తి, జూలై 20: బసంత్‌నగర్ పోలిస్టేషన్ పరిధిలోని కన్నాల టోల్ ప్లాజా వద్ద గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి శనివారం తెలిపారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా మధ్యాహ్నం ముగ్గురు వ్యక్తులు రెండు బైక్‌ల పై అను మానాస్పదంగా కనిపించారని చెప్పారు. అదుపులోకి తీసుకొని విచారించగా రామగుండం గ్రామానికి చెందిన బానోత్ రమేష్ , గుగులోత్ రాజేష్‌నాయక్, ఈసాల తక్కళ్లపల్లికి చెందిన గాలిపెల్లి నిఖిల్ గంజాయిని తోకల సిద్ధార్థ నుంచి కొనుగోలు చేశామని ఒప్పుకున్నారని తెలిపారు. సుమారు 242 గ్రాముల గంజాయి , రెండు బైకులు, సెల్ ఫోన్‌లు స్వాధీన పరుచుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరు సీఐల బదిలీలు

కరీంనగర్‌క్రై, జూలై 20: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. మానకొండూర్ నూతన సీఐగా జి సదన్‌కుమార్‌ను నియామకం చేయగా ఇప్పటి వరకు మానకొండూర్ సీఐగా పనిచేస్తున్న ఎం రాజ్‌కుమార్‌ను మల్టీజోన్-1 ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 6న మల్టీజోన్-1 ఐజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న సదన్‌కుమార్‌ను మానకొండూర్ సీఐగా, రాజ్‌కుమార్‌ను రామగుండంలో కమిషనరేట్‌లోని మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మానకొండూర్ సీఐగా సదన్‌కుమార్‌ను నియామకం చేస్తూ ఉత్తర్వులు వెలువడటం గమనార్హం.

కాలువలు ఇలా.. సాగునీరు ఎలా?



డి90 కాలువలో మొక్కలు

చొప్పదండి, జూలై 20: చొప్పదండి మండలంలో పంటకాలువల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. డి88, డి90 కాలువలకు ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో పిచ్చి చెట్లతో నిండిపోయాయి. దీంతో చివరి ఆయకట్టుకు నీరు అందక రైతులు ప్రతిసారి ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో డి83 నుంచి 90 వరకు డిస్ట్రిబ్యూటరీ కాలువలు ఉండగా డి83, డి86 కాలువలు పెద్దపల్లి జిల్లాకు నీటిని సరఫరా చేస్తారు. మిగతా కాలువల ద్వారా మండల పరిధిలో వ్యవసాయ భూములకు నీరు అందతుంది. అధికారులు స్పందించి కాలువలకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు

ఎస్సారెస్పీకి పెరిగిన వరద

- ప్రాజెక్టులోకి 18,275 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు రాక పెరుగుతోంది. ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 18,275 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి శనివారం ప్రస్తుతం 17.662 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 28.541 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 12.163 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.021 టీఎంసీల నీటిని వివిధ అవస రాల నిమిత్తం వ్యయం చేశారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి చేరిన వరదనీరు

ధర్మపురి వద్ద స్వల్పంగా పెరిగిన గోదావరి



ధర్మపురి వద్ద పారుతున్న గోదావరి

ధర్మపురి, జూలై 20: ధర్మపురి వద్ద గోదావరి నది నీటి మట్టం శనివారం స్వల్పంగా పెరిగింది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసి న వర్షాలకు ప్రవహిస్తున్న నీరు నదిలో చేరుతోంది. కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టుకు సంబం ధించిన 8, 9, 11 వ నెంబర్ గేట్లు ఎత్తి వేశారు. సాయంత్రం 6-30 గంటల వరకు అధికారులు గోదావ రి దిగువకు 11,016 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. దీంతో ప్రస్తుతం గోదావరి నీటి ప్రవాహం స్వల్పంగా పెరిగింది. ఎగువ వైపు ఉన్న సత్యవతి గుండం నుంచి దిగువ రాయపట్నం వైపు వరద ప్రవాహం కొనసాగుతోంది. ధర్మపురి వద్ద ఉసిరిక వాగు ఆనుకుని నీటి ప్రవాహం ఉంది. వాగు దాటి అటు వైపు వెళ్లలేని పరిస్థితి ఉంది. చిన్న గద్దె నీటిలో మునిగిపోగా, మంచి నీటి బావి చుట్టూ ఆనుకుని నీటి ప్రవాహం ఉంది. గోదావరి వరద పరిస్థితి గురించి ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మండల తహసీల్దార్ కృష్ణచైతన్య ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గోదావరి నదీ పరిసర గ్రామాలైన ఆరెపల్లి, దొంతాపూర్, రాజారం, దమ్మన్నపేట, ధర్మపురి, తిమ్మాపూర్, రాయపట్నం గ్రామాలకు చెందిన ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపర్లను గోదావరి నదీ వైపు వెళ్లకుండా అప్రమత్తం చేశారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఉదయ్ కుమార్, పోలీస్ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేశారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ

- మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, జూలై 20: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ క్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అద్దాల మండపంలో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణాలు చేశారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహ మూర్తి, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శనివారం సందర్శించారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆ యనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు బహూకరించి సత్కరించారు.

కరీంనగర్ జైలును సందర్శించిన న్యాయసేవాధికార కార్యదర్శి

కరీంనగర్ క్రైం, జూలై 20: కరీంనగర్ జిల్లా జైలును శనివారం కరీంనగర్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కే వెంకటేష్ సందర్శించారు. జైలులో ఖైదీల యోగ క్షేమాలను, భోజన వసతులు, న్యాయ సేవా, ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తరువాత జైలులో కాంటీన్, జైలు ఆసుపత్రి, ములాఖత్, ఫోన్ సౌకర్యం, లైబ్రరి, వంటశాల, జైలు ఇండస్ట్రీలలో పనితీరు బాగా జరుగుతుందని అధికారులను అభినందించారు. ఖైదీలతో మాట్లాడుతూ పోక్సో యాక్టు, ఎన్‌డీసీఎస్, మోటార్‌వేహికల్ యాక్టు, సీనియర్ సిటిజన్ యాక్టు, 498-ఎ యాక్టు వంటి చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా జైలును కూడా సందర్శించి మహిళా ఖైదీలతో మాట్లాడుతూ వారి కేసు వివరాలను, బాగోగులను, జైలులో వారికీ కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. జైలులో మహిళా ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు ప్రవేట్ లా యరును పెట్టుకునే స్తోమత లేని ఖైదీలకు ప్రభుత్వ లాయర్‌ను నియమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కే శ్రీనివాస్, జైలర్స్ పి శ్రీనివాస్, బి రమేశ్, డిప్యూటీ జైలర్స్ ఏ శ్రీనివాస్‌రెడ్డి, ఎం సుధాకర్‌రెడ్డి, లీగల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సిల్ లాయర్ తణుకు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు చెల్లించమన్నందుకు మహిళ హత్య

- మృతదేహాన్ని గోనెసంచిలో మూటకట్టి బావిలో వేసిన నిందితులు

- హత్యలో పాల్గొన్న ముగ్గురి అరెస్టు

- వివరాలు వెల్లడించిన గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమేశ్

మంథని, జూలై 20: తీసుకున్న అప్పును తిరిగి ఇవ్వమని అడినందుకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రానికి చెందిన పెరుక రాజేశ్వరి(65) అనే మహిళను అదే గ్రామానికి చెందిన అమ్ము రజిత అలియాస్ లావణ్య, భర్త రవి అలియాస్ రమేష్, కుక్కముడి తిరుపతి ఈనెల 5న హత్య చేశారని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ తెలిపారు. మంథని పోలీసు స్టేషన్‌కార్యాలయంలో రాజేశ్వరి హత్యకు సంబంధించిన వివరాలను గోదావరిఖని ఏసీపీ రమేశ్ శనివారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లావణ్య తన ఇంటి సమీపంలోని పెరక రాజేశ్వరి వద్ద లక్షా యాభై వేల రూపాయలు అప్పుగా తీసుకుంది. రాజేశ్వరి తరుచూ అప్పు డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగేది. దీంతో ఆగ్రహించిన లావణ్య ఈనెల 5వ తేదీన అప్పు ఇస్తానని రాజేశ్వరిని ఇంటికి పిలిచింది. అనంతరం భర్త రవి, మరో వ్యక్తి కుక్కముడి తిరుపతితో కలిసి ఇంట్లో గొంతు నులిమి చంపారు. అదే రోజు రాత్రి మృతురాలి ఒంటి ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలను తీసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని గొనె సంచిలో మూట కట్టి పారుపల్లి శివారులోని వ్యవసాయ బావిలో వేశారు. అనంతరం బంగారు ఆభరణాలను వరంగల్‌లో విక్రయించారు. అనంతరం 8వ తేదీన స్థానికులు వ్యవసాయ బావిలో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. తాడుతో కట్టి ఉన్న గోనసంచి మూటను బయటకు తీసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. 14వ తేదీన మృతదేహం పెరుక రాజేశ్వరిదిగా గుర్తించారు. అనంతరం విచారణ చేపట్టగా ముత్తారం గ్రామానికి చెందిన లావణ్య లక్షా యాభై వేల రూపాయలు మృతురాలు రాజేశ్వరి వద్ద అప్పుగా తీసుకున్నట్టు గుర్తించారు. అప్పు విషయంలో లావణ్యకు, రాజేశ్వరికి మధ్య గొడవలు జరిగాయి. పోలీసులు లోతుగా విచారణ చేపట్టగా రాజేశ్వరిని ఈ నెల 5వ తేదీన లావణ్య, ఆమె భర్త రవి అలియాస్ రమేష్, మరో వ్యక్తి కుక్కముడి తిరుపతి హత్య చేశారని తేలింది. ముగ్గురు నిందితులను శనివారం ఉదయం మంథని సీఐ వెంకటేశ్వర్లు, ముత్తారం ఎస్‌ఐ మధుసూదన్‌రావు అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ, ఎస్‌ఐ, కానిస్టేబుల్స్ దుబాసి రమేష్, బాలగాని కిరణ్‌లను ఏసీపీ రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.

ఐదుగురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్ల క్రైం, జూలై20: ఉద్యోగాల కల్పన పేరుతో లోకల్ యాప్‌లో ప్రకటనలు ఇచ్చి సైబర్ మోసాలకు పాల్పడిన ఐదుగురు అంతర్ రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన దూస రమ్య ఉద్యోగం కోసం లోకల్ యాప్‌లో ప్రకటన చూసి ఫోన్ నంబరులో సంప్రదించింది. రూ.400 చెల్లించాలనడంతో ఫోన్ పే ద్వారా పంపింది. అనంతరం ఆమెకు ఫోన్ చేసిన నిందితులు జాబ్ వచ్చిందని ఐడీ క్రియేషన్ కోసం రూ.5 వేలు చెల్లించాలని నమ్మించారు. వెంటనే బాధితురాలు డబ్బు పంపింది. ఉద్యోగం ఎప్పుడు ఇస్తారని బాధితురాలు ఫోన్‌చేయగా మళ్లీ రూ.5 వేలు చెల్లించాలనడంతో పంపింది. ఆ తర్వాత ఆ ఫోన్ నంబరు రెస్పాన్స్‌లో లేకపోవడంతో సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీంతో ప్రత్యేక పోలీసు బృందం ద్వారా విచారణ చేపట్టగా సైబర్ మోసం వెలుగు చూసింది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ జిల్లా శారదానగర్‌లో ఎర్రబద్ది గోపి (31), సోమందేపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన కురుబా అశోక్‌కుమార్ (18), కురుబా వరలక్ష్మి (21), బీచ్ అగ్నిపల్లికి చెందిన ఎం. బ్రహ్మేంద్ర (19), పుట్టపర్తి సత్యసాయి జిల్లా పరిగి మండలంలోని సెయ్యపల్లి గ్రామానికి చెందిన ఎం.స్వాతి సంజీవప్ప (19)ను రిమాండ్‌కు తరలించారు. ఎర్రబద్ది గోపి అనే యువకుడు ట్రాన్స్ ఇండియా కార్పొరేషన్ నెట్‌వర్క్ అనే కంపెనీ పేరుతో అనంతపూర్ జిల్లాలో లోకల్‌యాప్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటనలు ఇచ్చాడు. దీంతో అదే కంపెనీలో పనిచేస్తున్న అశోక్, వరలక్ష్మి, బ్రహ్మేంద్ర, స్వాతి రూ.10 వేల చొప్పున చెల్లించారు. ఆ తర్వాత కమీ షన్ వస్తుందని చెప్పి వారికి ఐడీ కార్డులు ఇచ్చి నిరు ద్యోగులను చేర్పించాలని చెప్పాడు. వారి ద్వారా అదేపనిగా మల్టీ లెవల్ మార్కెటింగ్ విధానంలో కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి తెలంగాణ, ఏపీలో సైబర్ మోసాలకు పాల్పడ్డాడు. ఈ కంపెనీపై 10 ఫిర్యాదులు ఉన్నాయని, నిందితుల వద్ద ల్యాప్‌టాప్, ఐదు మొబైల్స్, బ్యాంక్ అకౌంట్స్ సీజ్ చేశామని ఎస్పీ వివరించారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశం



అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను సన్మానిస్తున్న సభ్యులు

కరీంనగర్ లీగల్, జూలై 20: తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్త పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాసిక్యూటర్ల సమస్యలు, సందేహాలపై చర్చించారు. క్రిమినల్ కేసులు విచారణకు వచ్చే ముందు ప్రాసిక్యూటర్లకు వాటిపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. నిందితులకు శిక్షలు పడేలా దృష్టి సారించాలని ఆయన ప్రాసిక్యూటర్లకు సూచించారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళీధర్ రావు కొత్త చట్టాల గురించి వివరించారు. ఇటీవల కరీంనగర్ నుంచి హుజూరాబాద్‌కు బదిలీ అయిన వసంత, మంథని నుంచి మెట్‌పల్లికి బదిలీ అయిన ప్రణయ్‌లను సన్మానించారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఆరెల్లి రాములు, జూలూరి శ్రీరాములు, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, పెంట శ్రీనివాస్, లక్ష్మి ప్రసాద్, శరత్ పాల్గొన్నారు.

ఏక కాలంలో రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌దే



ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

గంభీరావుపేట, జూలై 20 : ఏక కాలంలో రైతు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో మున్నూరుకాపు ఆత్మీయ సన్మానం కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా ఎదగడం కోసం సీఎం రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ సాహోస పేతమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇది రాజకీయ వేదిక కానప్పటికీ రైతాంగాన్ని అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న విషయాలను అందులో రుణ మాఫీని గుర్తు చేసుకోవాలన్నారు. ఈ వేదిక ద్వారా ఈ ప్రభుత్వానికి దన్యవాదాలు చెప్పాల్సిన అవ సరం ఉందన్నారు. వ్యవసాయమే జీవన ఆధారంగా మున్నూరు కాపులు జీవనం సాగిస్తున్నారన్నారు. మున్నూరు కాపులు చదువుతోపాటు రాజకీయంగా ఎదగడనికి ఇతర కులాల అభిమానాన్ని చూరగొనాలని, అప్పుడే రాజకీయంగా మరింత ఎదుగుతారని అన్నారు. అందిపుచ్చుకోటానికి ముందుకొస్తే తన వంతు సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు కూర సురేష్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, మాజీ సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య రాష్ట్ర నాయకులు గడ్డం నర్సయ్య, కొమిరిశెట్టి తిరుపతి, దుమాల శ్రీకాంత్, జిల్లా నాయకులు అగ్గి రాములు, గంట అశోక్, బాలయ్య, మండల యువజన విభాగం కిరణ్‌కుమార్, స్థానిక నాయకులు గంట శ్రీనివాస్, నంది కిషన్ తదితరులు ఉన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



కోనరావుపేటలో అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఎంపీడీవో



రుద్రంగిలో అక్షరాభ్యాసం

కోనరావుపేట, జూలై 20: పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, అప్పుడే ఆరోగ్యవంతంగా ఎదుగుతారని ఎంపీడీవో శశికళ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంతోపాటు నిమ్మపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ బాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శనివారం పిల్లలకు సామూహిక అక్షర అభ్యాసాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మంచి పౌష్టిక ఆహారంతోపాటు విద్యను అందించనున్నట్లు చెప్పారు. పిల్లలను మూడు సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేఖ, మాజీ ఎంపీటీసీ చారి, సూపర్వైజర్ గంగా లక్ష్మి, అంగన్వాడీ టీచర్లు నర్మదా, పద్మ, అరుణ, శారద పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు అగ్రహారం, తిమ్మాపూర్, రాజన్నపేట, గుండారం, అక్కపల్లి, దుమాల, నారాయణపూర్ తదితర గ్రామాల్లో 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. రెండేళ్ల వయసు ఉన్న పిల్లలను గుర్తించి కేంద్రాల్లో చేర్పించారు. చిన్నారులతో కలిసి అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ కోమిరె మంజుల మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే ప్రీ స్కూల్‌లో ఒత్తిడి లేకుండా ఆటాపాటలతో విద్యాబోధన అందించనున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు టీచర్‌లు కొమిరె మంజుల, జ్యోతి, సరిత పాల్గొన్నారు.

పాఠశాలలో గ్రీన్‌డే వేడుకలు

తంగళ్లపల్లి, జూలై 20: తంగళ్లపల్లి మండల కేంద్రంలో సరస్వతి శుభోదయం ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం గ్రీన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ జూలై 2015 సంవత్సరం నుంచి గ్రీన్‌డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అడవుల శాతం పెంచాలనే ఉద్దేశంతో ఏటా మొక్కలు నాటుతున్నామన్నారు. విద్యార్థులు, తల్లి దండ్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ మాధవి లత రెడ్డి, ప్రైమరి ఇంచార్జ్ పద్మశ్రీ, సందీప్, వాణి, సరిత, కీర్తన, సౌజన్య, సౌమ్య అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలి

ఇల్లంతకుంట, జూలై 20: ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ బత్తిని స్వామి ఒక ప్రకటనలో కోరారు. 2014 నుంచి సాంకేతిక కారణాలతో కొంత మంది రైతుల రుణాలు పెండింగ్‌లో ఉన్నాయని, వారికి కూడా రుణమాఫీ చేయాలని కోరారు. బంగారంపై రుణాలు తీసుకున్న వారిని ఇబ్బంది పెట్టువద్దని పేర్కొన్నారు. ప్రభుత్వం రుణాల మొత్తాన్ని మాఫీ చేశామని ఆర్భాటంగా ప్రకటిస్తోందని, ఆచరణలో పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని తెలిపారు. అధికారులు స్పందించి రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు.

చదువు చెప్పేదెవరు?

వీర్నపల్లి, జూలై 20: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చదివించాలంటూ ప్రభుత్వం చెబుతున్న ఉపాధ్యాయుల కొరత ఉంటే చదువు చెప్పేదెవరని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు పదోతరగతి విద్యార్థులకు గణితం, ఆంగ్లం, భౌతిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు ఎక్కడని ప్రశ్నించారు. గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో కొందరు పిల్లలను ఇతర పాఠశాలల్లో చదివించేందుకు దూర ప్రాంతాలకు పంపిస్తున్నారన్నారు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా పదోతరగతి విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల్లో పాఠాలు మొదలు కాలేదన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులను కేటాయించాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు భారతవ్వ, పద్మ, సత్తవ్వ, నర్సవ్వ, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రేమ్ సాగర్, ఉపాధ్యాయినులు ఉమారాణి, మంజుల పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్వో ప్లాంట్ అందజేత

ఇల్లంతకుంట, జూలై 20: మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఆర్వో ప్లాంటు అందజేసేందుకు దాతలు ముందుకొచ్చారు. పాఠశాల ఆవరణలో శనివారం జరిగిన సమావేశంలో గ్రామానికి చెందిన దాతలు స్మార్ట్‌టీవీ, విద్యార్థులకు నోటు బుక్కులను అందించారు. పాఠశాల అభివృద్ధి కోసం రూ.76వేల 259రూపాయలు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మాజీ సర్పంచ్ తూముకుంట శ్రీలతనరేందర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ మండల అధ్యక్షుడు మంద చక్రాదర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గోనె సత్యం, పాఠశాల కమిటీ ఛైర్మన్ జమున, దాతలు ఒల్లాల శ్రీనివాస్, మల్లమారి బాబు పాల్గొన్నారు.

599 మంది రైతుల పంట రుణాలు మాఫీ

ఇల్లంతకుంట, జూలై 20: ఇల్లంతకుంట సహకార సంఘం పరిధిలో 599 మంది రైతుల పంట రుణాలు మాఫీ అయినట్లు ప్యాక్స్ ఛైర్మన్ రొండ్ల తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం తొలివిడతగా రూ.లక్ష వరకు మాఫీ చేసిందని, సహకార సంఘం పరిధిలో రూ 3. 31కోట్ల రుణాలు మాఫీ అయ్యాయని తెలిపారు. రుణాలు మాఫీ కాని వారు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రైతులు హర్షిస్తే బీఆర్ఎస్ నాయకులు వ్యతిరేకిస్తారా?

ఎల్లారెడ్డిపేట, జూలై 20: ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చి రూ.లక్ష లోపు చేసిన రుణమాఫీపై రైతులు హర్షిస్తే బీఆర్ఎస్ నాయకులు వ్యతిరేకిస్తారా? అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ప్రశ్నించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తిస్తోందన్నారు. బీఆర్ఎస్ నాయకులు అర్థరహిత ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆగస్టు 15లోగా అన్నదాతల రుణమాఫీని ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, లింగాగౌడ్, సాహెబ్, శ్రీనివాస్‌రెడ్డి, బాబు, శ్రీనివాస్, రాజయ్య, బుచ్చాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాలీ ఆటో అద్దాలు ధ్వంసం

ఎల్లారెడ్డిపేట, జూలై 20: తన ట్రాలీ ఆటో అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి ధ్వంసం చేశారని, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశానని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని దుబ్బ శ్రీనివాస్ శనివారం తెలిపాడు. రోజులాగే తన వాహనాన్ని మండల కేంద్రంలోని కామారెడ్డి - సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన ఉన్న ఓ దుకాణం వద్ద నిలిపి ఇంటికి వెళ్లానని, శనివారం ఉదయం వాహనం వద్దకు వచ్చి చూసే సరికి ఆటో అద్దాలు పగిలిపోయి కనిపించాయని పేర్కొన్నాడు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు శ్రీనివాస్ పేర్కొన్నాడు.

పాఠశాలలకు గడియారాల అందజేత

గంభీరావుపేట, జూలై 20 : గంభీరావుపేట మండలం ముచ్చర్ల జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలకు మాజీ సర్పంచ్ చెవుల మల్లేశం సొంత ఖర్చులతో గోడ గడియారాలను అందజేశారు. మండల పరిషత్ పాఠశాలకు 10, జిల్లా పరిషత్ పాఠశాలకు 7 గోడ గడియారాలను అందజేశారు. ప్రదానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శ్రీకృష్ణయాదవ సంఘం కార్యవర్గం

ఎల్లారెడ్డిపేట, జూలై 20: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని శ్రీకృష్ణయాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శాగ శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా శాగ లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా అలివేలి సత్తయ్యలు ఎన్నికయ్యారు. కోశాధికారిగా పెంజర్ల సత్తయ్యయాదవ్, ముఖ్య సలహాదారులుగా ప్రభుదాస్‌యాదవ్, రాగం దేవదాస్, శాగ మల్లేశం, శ్రీనివాస్‌యాదవ్ ఎన్నికయ్యారు. సంఘం సభ్యుల అభ్యున్నతికి పాటుపడుతామని పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా రైతులకు గాయాలు

ముస్తాబాద్, జూలై 20: ముస్తాబాద్ మండల కేంద్రంలో నాట్లు వేయడానికి వెళ్తున్న మహిళా రైతులు శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మండల కేంద్రానికి చెందిన పలువురు మహిళా రైతులు నాట్లు వేయడానికి ట్రాక్టర్‌పై సిద్దిపేట వైపు వెళ్తున్నారు. ప్రమాదవశాత్తు ట్రాలీ బోల్తా పడింది. ఈ ఘటనలో పెంజర లక్ష్మి నర్సవ్వ, మల్లవ్వ సునందకు తీవ్ర గాయాలయ్యాయి. మరో 15 మంది మహిళా రైతులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెంటనే స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు.

అభివృద్ధి పనుల బిల్లులు ఇప్పించాలి



సమస్యలను వివరిస్తున్న తాజా మాజీ సర్పంచులు

వేములవాడ టౌన్, జూలై 20 : భార్య మెడలోని బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టి అభివృద్ధి పనులు చేశామని, బిల్లులు ఇప్పించి ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మొరపెట్టుకున్నారు. వేములవాడ పట్టణంలోని ఆది శ్రీనివాస్ నివాసంలో శనివారం తాజా మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచులు మాట్లాడారు. 2019 నుంచి 2024 వరకు గ్రామాల్లో సొంత డబ్బులతో అభివృద్ధి పనులు చేపట్టామని, గ్రామ పంచాయతీలో తీర్మానాలు, ఎంబీ రికార్డులు చేసి ప్రభుత్వానికి అందించామని అన్నారు. భార్య మెడలోని పుస్తెలతాడు తాకట్టుపెట్టి మరీ అభివృద్ధి పనులు చేసి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అప్పులు తీసుకొచ్చి మరికొంత మంది అభివృద్ధి పనులు చేశామని, అప్పులు తీర్చలేక చాలా మంది తాజా మాజీ సర్పంచ్‌లు మానసికంగా కుంగిపోతున్నారని అన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు లేకపోలేదని, ఒక్కో సర్పంచ్ రూ. 15 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు అభివృద్ధి పనులకు వెచ్చించారని తెలిపారు. తొందరగా నిదులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్‌ను కోరారు.

రాజిరెడ్డికి ఉత్తమ రక్తదాత అవార్డు



రాజిరెడ్డిని సన్మానిస్తున్న ముఖ్య అతిథులు

సిరిసిల్ల టౌన్, జూలై 20: టీఎస్ఎస్ఎఫ్ కరీం నగర్ పార్లమెంటరీ అధ్య క్షుడు మోతె రాజిరెడ్డి ఉత్తమ రక్త దాత అవార్డు అందు కున్నారు. ఇంటర్నే షనల్ వైశ్య ఫెడరేషన్ 11వ వార్షి కోత్స వాన్ని శనివారం హైద రాబాద్ ముషీరాబాద్ వైశ్య బాలుర హాస్టల్లో నిర్వ హించారు. వార్షికో త్సవాల్లో భాగంగా రాష్ట్రంలో ఎక్కువసార్లు రక్తదానం చేసిన రక్త దాతలకు ఉత్తమ రక్త దాతగా అవార్డులను అందజేశారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన టీఎస్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంటరీ అధ్యక్షుడు మోతె రాజిరెడ్డి ఉత్తమ రక్తదాతగా ఎంపికయ్యారు. ముఖ్య అతిధులు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, తెలంగాణ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మాజీ టూరిజం ఛైర్మన్ శ్రీనివాస్ గుప్తా, ఐవీఎఫ్ సేవదళ్ తెలంగాణ రాష్ట్ర ఛైర్మన్ నీల బాలు మోతె రాజిరెడ్డిని సన్మానించారు.

మౌలిక వసతుల కల్పనలో భాగస్వాములు కావాలి

చందుర్తి, జూలై 20: పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో తల్లిదండ్రులు భాగస్వాములుకావాలని ప్రధానోపాధ్యాయిని సుజాత అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఇంటింటా చదువుల పంట కార్యక్రమలో భాగంగా శనివారం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. పిల్లల చదువుపై ఇంటి వద్ద శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధ్యాయులు కటుకూరి ముఖేష్, కాపీల్ల నరేష్, రాకం రవికుమార్, కొత్తపల్లి శ్రీదర్, మమత, స్వప్న, భూజ్యోతి, అనసూయ, తల్లిదండ్రులు పోంచెట్టి రాఖేష్, సుద్దాల రామచంద్రం, చిలుక ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలతో విరాసత్

చందుర్తి జూలై 20:చందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో తప్పుడు పత్రాలతో విరాసత్ చేశారని బండపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు గడ్డం రణధీర్ రెడ్డి ఆరోపించారు. శనివారంవిలేకరులతో మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద బి/569/2018 విరాసత్ పత్రాల కోసం దరఖాస్తు చేశానని, ఆ ఫైలు లేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ సర్టిఫికెట్ లేకుండా పట్టా ఏ విధంగా చేసారో తెలపాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో అక్రమాలపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

ఎల్లారెడ్డిపేట, జూలై 20: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్వీ నాయకుడు జుబేర్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను స్థానిక నాయకులతో కలిసి శనివారం ఆయన సందర్శించారు. బడిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఉడకని భోజనం వండిస్తున్నారన్నారు. పాఠశాలలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం తీర్చాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని జుబేర్ హెచ్చరించారు.

టీడీపీ మండల అధ్యక్షుడికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, జూలై 20: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లిలోని టీడీపీ మండల అధ్యక్షుడు చెట్కూరి నారాయణగౌడ్ తల్లి సత్తవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని ఆ పార్టీ కరీంనగర్ పార్లమెంటు అధ్యక్షుడు వంచ శ్రీనివాస్‌రెడ్డి శనివారం పరామర్శించారు. నాయకులు దయాకర్‌రావు, సత్యం, శేఖర్‌గౌడ్, సూర్యనాయక్ తదితరులు ఉన్నారు.

బండి సంజయ్ ఇంటి ఎదుట దీక్ష చేపట్టాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి

సిరిసిల్ల టౌన్ జూలై 20 : బీజేపీ నాయకులు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఇంటి ఎదుట దీక్ష చేపట్టాలని లాల్ బావుటా చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్లలోని పవర్‌లూం పరిశ్రమలో సంక్షోభం నివారణ కోసం బీజేపీ నిరాహార దీక్షను చేపట్టడాన్ని అభినందిస్తున్నామన్నారు. రానున్న పార్లమెంటరీ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోయే 2024-25 వార్షిక బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ఎన్ని నిధులు తీసుకొస్తారో చెప్పాలని బండి సంజయ్ ఇంటి ముందు ధర్నా చేయాలని కోరారు. రెండేళ్లుగా తెలంగాణ రాష్ట్రానికి, చేనేత, పవర్‌లూంకు కేంద్రం గుండు సున్న మాత్రమే కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఉపాధి లేక అనేక మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్న బండి సంజయ్ స్పందించ లేదన్నారు. సిరిసిల్లకు రావల్సిన టెక్స్‌టైల్ పార్కు వరంగల్‌కు వెళ్తుంటే చోద్యం చూశారన్నారు. కేంద్రం పవర్‌లూం ఉత్పత్తులపైన జీఎస్టీ విధించడంతో వృత్తి పనులు కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో చేనేత జనాభా ప్రాతిపదికన బడ్జెట్లో నిధులను కేటాయించే విధంగా చూడాలన్నారు. ప్రధాని, ఆర్థిక మంత్రికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ లేఖ రాయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకుల అజ్జ వేణు, వెల్దండి రాజు, గాజుల లింగం దితరులు పాల్గొన్నారు.

పనివేళల మార్పును స్వాగతిస్తున్నాం

సిరిసిల్ల రూరల్, జూలై 20: ఉన్నత పాఠశాలల పనివేళలను రాష్ట్ర ప్రభుత్వం మార్పు చేయడాన్ని స్వాగతిస్తున్నామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాకాల శంకర్‌గౌడ్, గుండమనేని మహేందర్ రావు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉన్నత పాఠశాలల పనివేళలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు మార్చడం హర్షనీయమన్నారు. ప్రాథమిక ఉన్నత పాఠశాలలకు ఒకే పనివేళలు ఉండడంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు చాలా అనుకూలంగా ఉంటుందన్నారు. ఒకే గ్రామంలో ఉన్న ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలు ప్రస్తుతం ఉన్న పనివేళలతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఇబ్బందులు పడేవారని నూతన టైంటేబుల్ అందరికి సులువుగా ఉంటుందని అన్నారు. జిల్లా నాయకులు రమేష్, రవీందర్, శివకుమార్, మల్లేశం, నసీరుద్దీన్, సమ్మయ్య పాల్గొన్నారు.

చిన్న దేవాలయాల ఉద్యోగులను అనుమతించ వద్దు

వేములవాడ కల్చరల్, జూలై 20: చిన్న దేవాయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను రాజన్న ఆలయంలోకి డిప్యూటేషన్‌పై వచ్చేందుకు అనుమతించవద్దని రాజన్న ఆలయ ఉద్యోగులు శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. వేములవాడ పట్టణంలోని ఆది శ్రీనివాస్ నివాసంలో ప్రభుత్వ విప్‌ను కలిసిన ఆలయ ఉద్యోగులు అగ్రహారం ఆంజనేయస్వామి ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ అసిస్టెంట్ రాజన్న ఆలయంలోకి డిప్యూటేషన్‌పై వచ్చేందుకు దరఖాస్తు చేసుకున్నారని, మరికొంత మంది వచ్చేందుకు చూస్తున్నారని నిలిపి వేయాలని కోరారు. పదోన్నతి విషయంలో ఇబ్బందులు తలెత్తుతాయని ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకువెళ్లారు. చిన్న దేవాలయాల ఉద్యోగులను రాజన్న ఆలయానికి అనుమతించేది లేదని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆలయ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి కూరగాయాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలు సిగ్గుచేటు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్

సిరిసిల్ల టౌన్, జూల్ 20 : రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తే హర్షం వ్యక్తం చేయాల్సిన బీఆర్ఎస్ నాయకులు రూ.2లక్షలు ఇచ్చే వరకు పోరాటాలు చేస్తామనడం సిగ్గు చేటని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు చేసిందేమిటని ప్రశ్నించారు. నాడు కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన సమయంలో మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను పదేళ్లలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7 కోట్ల లక్షల అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఖాళీగా ఉన్న రాష్ట్ర ఖజానాను పూడ్చుకుంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రైతుల రూ. 2లక్ష రుణమాఫీలో భాగంగా మొదటి విడత రూ.లక్ష మాఫీ చేసినట్లు చెప్పారు. ఈ నెల చివరి వరకు రూ.1.50 లక్షల రుణాలు ఉన్న రైతులకు, ఆగస్టు 15లోగా రూ.2లక్షల వరకు చేయనున్నట్లు తెలిపారు. రుణమాఫీతో దాదాపు 65 లక్షల రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ప్రకటించినా బీఆర్ఎస్ నాయకులు పోరాటాలు చేస్తామంటూ ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతు బంధు గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. మాజీ మంత్రి, ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి రూ.2 కోట్లు చిలుకు రైతు బంధు ఇచ్చారని ఆరోపించారు. ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకు రైతు బంధు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీ వేసిందన్నారు. జిల్లా పరిధిలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో పేద రైతులకు రైతు రుణమాఫీ, రైతు బంధు అందేలా చూస్తామని ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్, నియోజవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణ అధ్యక్షుడు నక్క నర్సయ్య, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వైద్య శివప్రసాద్, గొల్లపల్లి పరశురాములు, త్యాగరాజు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణ

సిరిసిల్ల రూరల్, జూలై 20 : గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేతనం అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో శనివారం గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మాల్యాల నర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ బకాయిలు విడుదల చేసినందుకు యూనియన్ తరపున ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన డబ్బులను దారి మళ్లించకుండా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. అదే విధంగా వేతనాల పెంపు మల్టీపర్పస్ విధానం రద్దు, ప్రమాద బీమా సౌకర్యం, కారోబార్, బిల్ కలెక్టర్‌లకు స్పెషల్ స్టేటస్ వంటి అంశాలపై ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలలో నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వర్కోటు మల్లయ్య, బుర్ర శ్రీనివాస్, అంజయ్య, గంగరాజు, మహేష్, శేఖర్, అనిల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంట రుణమాఫీతో రైతుల్లో ఆనందం



చిన్నబోనాలలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల రూరల్, జూలై 20: పంట రుణమాఫీతో రైతుల్లో ఆనందరం వ్యక్తమవుతోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రుణమాఫీపై హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు నిర్వహించారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాలలో కాంగ్రెస్ వార్డు కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం ఎదుట శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మండల పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ చల్ల హరికృష్ణ, పార్టీ నాయకులు సుంకరి సాయికుమార్, చల్ల జగన్, గోస్కుల ఎల్లయ్య, కముటం లచ్చిరెడ్డి, సలేంద్రీ శంకర్, గోస్కులదేవయ్య, వేముల పర్శయ్య, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: పంట రుణమాఫీపై హర్షం వ్యక్తం చేస్తూ గంభీరావుపేట మండలం గజసింగవరం, రాజేశ్వర్‌రావునగర్‌కాలనీ, గోరంటాల, లింగాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, పార్టీ జిల్లా ఉపాద్యాక్షుడు తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

కోనరావుపేట: రైతులను రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా అన్నారు. కోనరావుపేట మండలం మామిడిపెల్లిలో శనివారం రైతులకు రుణమాఫీ చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు రైతులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయనన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి, అమృతరావు, సంజీవరావు, మల్లేశం, ప్రేమ్‌చంద్, సాగర్, రాములు, ఉస్మాన్, మల్లరెడ్డి, సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మామిడిపెల్లిలో..